అక్రమ లేఅవుట్ నిర్వాహకులకు నోటీసులు

- పనులు నిలిపివేయించిన పంచాయతీ సెక్రటరీ



లేఅవుట్ నిర్వాహకులకు నోటీసును అందజేస్తున్న పంచాయతీ కార్యాదర్శి రజనీకాంత్

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా డెవలప్ చేస్తున్న లేఅవుట్‌కు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామపరిధిలోని సర్వే నంబర్ 31లో పంచాయతీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మనరూప మెడోస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రమేష్‌బాబు అనే వ్యక్తి అక్రమంగా లేఅవుట్‌ను చేస్తున్నాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌కు ఫిర్యాదు అందడంతో శుక్రవారం లేఅవుట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అక్కడ ఎలాంటి పనులు నిర్వహించవద్దని వారికి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు పెడతామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



జడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

చంపాపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎస్‌ఎన్‌డీపీ నిధులతో చేపట్టనున్న నాలా నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని జడ్సీని కోరినట్లు తెలిపారు. ఏపీఎస్‌ఈబీ కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు నాలా నిర్మాణం కోసం రూ.12.30కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాకాలం రాకముందే అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయాలని జడ్సీకి వినతి



జడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

సైదాబాద్ : డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం దక్షిణ మండలం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నను ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోనే అధిక ప్రాపర్టీ ట్యాక్సులు చెల్లిస్తున్న ఐఎస్ సదన్ డివిజన్‌కు నిధులు మంజూరులో అధికారులు పక్షపాతవైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. 18నెలలుగా డివిజన్‌కు ఎటువంటి బడ్జెట్ కేటాయించలేదని పేర్కొన్నారు. పెండింగ్ పనులకు సత్వరమే రూ.1.68కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు

- ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్‌చంద్రారెడ్డి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో అధికారులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వాహకులు, వాహన యజమానులు వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి తెలిపారు. గురువారం హయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని వ్యాన్ కిందపడి మృతిచెందిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం వనస్థలిపురంలో పాఠశాలల వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల వాహనాలు నడపరాదని హెచ్చరించారు. వాహనాల ఫిట్‌నెస్ సరిచూసుకోవాలని, వ్యానుల్లో సీటింగ్ ఎంత వరకు ఉంటే అంతమంది విద్యార్థులనే ఎక్కించుకోవాలని సూచించారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలు పాఠశాలలకు చెందిన పది వాహనాలను అధికారులు సీజ్‌చేసి మన్నెగూడలోని ఆర్టీవో కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్జయిని మహంకాళి విగ్రహం పునఃప్రతిష్ఠ


ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ధోబీ గల్లిలో అతిపురాతనమైన దేవాలయంలో శుక్రవారం ఉజ్జయిని మహంకాళి దేవతా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠాపన చేశారు. వేద పండితులు హోమాలు, అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుగుడాల సుదర్శన్, బాబు శ్రీనివాస్, ఆగమయ్య చౌదరి, చౌకి రవికుమార్, ఎం.రాజు, పిటి శంకర్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు నాగరాజు, నాగదేవత వద్ద ఈశ్వరునికి సుబ్రహ్మణ్యేశ్వరునికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, ఉండ్రాళ్లతో లక్ష్మీగణపతి హోమం, ఉక్తహోమం నిర్వహించారు. కల్యాణాంతరం గరుడవాహనంపై గ్రామోత్సవం నిర్వహించగా దారి పొడవునా భక్తులు గోవింద నామస్మరణలతో ముందుకు సాగారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రాష్ట్రీయ గ్రామీణ సాక్షరతా మిషన్ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేశారు. తమ వంతు సహాయంగా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు బ్యాగులను అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు మార్క సురేష్‌నవీన దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి స్కూల్ హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, కరుణ, సబితా, శ్రీనివాస్, వెంకటేష్, వెంకటనవీన్‌కుమార్, సుధాకర్, రమేష్‌కృష్ణ, శ్రీహరి, వెంకటేష్‌గౌడ్, మేడిపల్లి వెంకటేష్‌గౌడ్, నాగమణి, మహ్మద్ జిలానీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రత్నం

అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి : రత్నం

వనస్థలిపురం : రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రత్నం అన్నారు. ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాములుగౌడ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ డివిజన్ హుడాసాయినగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రత్నం మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, సీపీఐ ఎల్బీనగర్ నాయకులు బాతరాజు నర్సింహ, రమావత్ నక్రునాయక్, పూజారి శ్రీను, నాగరాజు, వెంకట్, అంకన్న పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫిట్‌నెస్ లేని వాహనాలు

ప్రమాదంలో చిన్నారుల జీవితాలు

- ఒక్క ఓమ్నీ వ్యాన్‌లో 15మందికి పైగా పిల్లలు
- బాలాపూర్ మండలంలో ఇదీ పరిస్థితి
- పట్టించుకోని ఆర్టీఏ, పోలీసు, ట్రాఫిక్ అధికారులు



బడంగ్‌పేట్‌లోని ఓ స్కూల్‌కు చెందిన ఓమ్నీ వ్యాన్‌లో 15 మందికి పైగా విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం.

సరూర్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అది ఐదుగురు ప్రయాణించడానికి అనువుగా తయారు చేసిన ఓమ్నీ వ్యాను.. కానీ అందులో ఏకంగా 15మందికి పైగా విద్యార్థులను కుక్కుతున్నారు.. వెనుక సీట్లో ఐదుగురు, దాని వెనుక ఉన్న డిక్కీలో ఇంకో ఐదుగురు, డ్రైవర్ పక్కన గల సింగిల్ సీట్లో ముగ్గురు, డోర్లకు అటూ ఇటూ వేలాడుతూ మరో నలుగురు, ఇక టాప్‌లో డిక్కీ డోర్‌ను సపోర్ట్‌గా పట్టుకుని ఇంకో ముగ్గురు.. ఇలా ఒక్క ఓమ్నీ వ్యానులో ఏకంగా 15 నుంచి 20 మంది విద్యార్థులను తరలిస్తున్నారు. అలా అని అది రోడ్లపై ప్రయాణికులను చేరవేసే ప్రైవేటు వాహనం కాదు.. ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులను తరలించడానికి వినియోగిస్తున్న ఓ చిన్న వ్యాను..! బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో గల అనేక ప్రైవేటు పాఠశాలలు ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఏ మాత్రం ఫిట్‌నెస్ లేని చిన్న చిన్న వాహనాలను విద్యార్థుల కోసం వాడుతున్నాయి. మీర్‌పేట్, జిల్లెలగూడ, గాయత్రీనగర్, ఆర్‌ఎన్‌రెడ్డినగర్, ప్రశాంతిహిల్స్, నందిహిల్స్, లెనిన్ నగర్, బాలాపూర్ చౌరస్తా, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, బాలాపూర్, వెంకటాపూర్, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో నడుస్తున్న అనేక ప్రైవేటు పాఠశాలలు అధిక శాతం పీయూసీ(పొల్యూషన్), ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ పత్రాలు వంటివి లేని వాహనాలను విద్యార్థుల తరలింపు కోసం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక స్కూల్‌లో పది దాకా వాహనాలు ఉంటే వాటిలో నాలుగింటికి మాత్రమే అన్ని పత్రాలు సక్రమంగా పెట్టుకుని, మిగతా వాహనాలను అధికారుల 'ఆశీస్సుల'తో నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు.

కన్నెత్తి చూడని ఆర్టీఏ అధికారులు

ప్రైవేటు స్కూళ్ల వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఇతర అంశాలపై దృష్టి పెట్టాల్సిన ఆర్టీఏ, పోలీసు, ట్రాఫిక్ అధికారులు ఆ దిశలో చర్యలు తీసుకోవడంలేదు. విద్యా సంవత్సరం మొదట్లో కొన్ని రోజుల పాటు తనిఖీల పేరుతో హడావుడి చేసి ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది భారీ వాహనాలు తిరిగే నాదర్‌గుల్-బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ-మంద మల్లమ్మ చౌరస్తా, బడంగ్‌పేట్-బాలాపూర్ చౌరస్తా వంటి ప్రధాన రహదారులపై సైతం మినీ వాహనాలు లెక్కకు మించి చిన్నారులతో వేగంగా వెళ్తూ కనిపిస్తున్నాయి. ప్రమాదవశాత్తూ అనుకోని సంఘటన జరిగితే దానికి బాధ్యులు ఎవరు? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా విభాగాల అధికారులు స్పందించి ప్రైవేటు స్కూళ్ల వాహనాలపై దృష్టి సారించి అన్ని పత్రాలు పరిశీలించాలని, అనుమతి తీసుకున్న వాహనాల్లో సామర్థ్యానికి తగినట్లుగా మాత్రమే విద్యార్థులు ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆటోల్లోనూ సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, అధికారులు వాటిపై కూడా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. పలు స్కూళ్లలో లైసెన్సులు లేని డ్రైవర్లు పని చేస్తున్నారని, దానిపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల యూనియన్లు ఏం చేస్తున్నట్టు..?

బాలాపూర్ మండలంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల కమిటీలు ఉన్నప్పటికీ తమ డిమాండ్ల సాధన కోసం తప్ప విద్యార్థుల క్షేమం కోసం సదరు కమిటీలు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో అనుమతిలేని, ఫిట్‌నెస్‌లేని మినీ వాహనాలు కొల్లలుగా తిరుగుతున్నా కమిటీల్లోని బాధ్యులు ఎవరికి వారు తమకెందుకులే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు..?

గతంలో ప్రైవేటు పాఠశాలల వాహనాలు ఢీకొని ఎంతో మంది చిన్నారులు మృత్యువాత పడగా.. తాజాగా హయత్‌నగర్‌లో ఓ చిన్నారి స్కూల్ వ్యాను(ఓమ్నీ కారు) కింద పడి మరణించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ప్రైవేటు పాఠశాలలు స్వరాజ్ మజ్దా లాంటి పెద్ద వాహనాలను మాత్రమే పిల్లల తరలింపు కోసం వాడాల్సి ఉండగా.. పలు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా కార్లు, జీపులు, మినీ(ఓమ్నీ) వ్యాన్లు వంటి వాహనాలను వాడుతున్నాయి. ఇంకొన్ని స్కూళ్లు ఆటోలను ఎంగేజ్‌కు తీసుకుంటున్నాయి. ఇక ఆయా వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా సామర్థ్యానికి మించి చిన్నారులను ఎక్కిస్తున్నారు. ఐదుగురు మాత్రమే ప్రయాణించాల్సిన ఓ మినీ వ్యానులో 20మంది దాకా విద్యార్థులను ఎక్కించారంటే ప్రైవేటు పాఠశాలల వ్యాపార ధోరణిని అర్థం చేసుకోవచ్చు అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సదరు చిన్న వాహనాల్లో నిబంధనల మేరకు అనుమతి తీసుకుని, సామర్థ్యానికి తగ్గట్టుగా విద్యార్థులను తరలించాల్సి ఉండగా, యాజమాన్యాలు అవేమీ పట్టించుకోవడం లేదు. అధికారులు సైతం కమిషన్లకు ఆశపడి చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఎల్బీనగర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ అన్నారు. శుక్రవారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా స్థానిక కార్పొరేటర్ వనస్థలిపురం డివిజన్‌లో సుమారు రూ.8కోట్ల నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ, వరదనీటి కాలువ పనులు, పార్కులు పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. పూర్తైన ఈ అభివృద్ధి పనులను త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు. పదేళ్లుగా మున్సిపల్ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు కుమ్మక్కై అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వ్యవహరించిన విధంగానే నేటికీ అదేవిధంగా వ్యవహరిస్తున్నారనీ, ఇక నుంచి మానుకోవాలని హెచ్చరించారు. మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది లంచాలకు అలవాటుపడి ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్‌లో చెరువులు, కుంటలు కబ్జాకు గురైనా కూడా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం అన్నారు. ఇకపై అవినీతి అక్రమాలు జరగనివ్వనని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒకటేనని అందుకే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీ చేస్తలేదని విమర్శించారు. బీజేపీకి మద్దతుగానే బీఆర్‌ఎస్ ఎన్నికలకు దూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో గెలిచినా..ఓడినా ఎల్లప్పుడు తాను ప్రజల పక్షమే అని పేర్కొన్నారు. ఎల్బీనగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, సత్యనారాయణ, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కట్ల నర్సింహయాదవ్, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కవిత, సుజాత, కిరణ్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉదయ్‌నగర్‌కాలనీలో పర్యటన

చంపాపేట : చంపాపేట డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌కాలనీలో శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడి ఆయన సమస్యలను తెలుసుకున్నారు. వరదనీటి కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ఎస్‌ఎన్‌డీపీ డీఈ, ఆయా శాఖల అధికారులతో ఆయన మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దుర్గారెడ్డి, ఓరుగంటి వెంకటేశ్, బద్రీనాథ్, తోకటి కిరణ్, కిరణ్, కవిత, భాను పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తతో అగ్ని ప్రమాదాలను నివారించొచ్చు

- సమన్వయ సమావేశంలో సీపీ సుధీర్‌బాబు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ సుధీర్‌బాబు తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు అనేవి ఆకస్మాత్తుగా సంభవించేవని, సరైన అవగాహన లేమి, నిర్లక్షంగా ఉంటే ఆస్తినష్టంతోపాటు ప్రాణనష్టం జరుగుతుందని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. తరచు జరుగుతున్న అగ్ని ప్రమాదాలను నివారించేందుకు కమిషనరేట్‌లో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రమాదాలను నివారించవచ్చని, తక్కువ సమయంలో ఘటనాస్థలానికి చేరుకోవడంతో ప్రమాద తీవ్రత తగ్గించవచ్చన్నారు. విపత్తు నిర్వహణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అందరూ అవగాహన పెంచుకోవాలని, అధికారులు తమ సిబ్బందికి ఎప్పటికప్పుడు అంతర్గత శిక్షణ కార్యక్రమాల ద్వారా శిక్షణ ఇవ్వాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాల్లో విపత్తు నిర్వహణ కిట్లను అందుబాటులో ఉంచడంతోపాటు అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

మన్సూరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద నివారణలో భాగంగా ట్రాఫిక్ నియమనిబంధనలు, శాంతిభద్రతలపై తమ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని మన్సూరాబాద్‌లోని కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాచకొండ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హీరో మోటోక్రాఫ్ సహకారంతో ఎల్బీనగర్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కులో ట్రాఫిక్ నిబంధనలపై తమ పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించడంతో పాటు పలు రకాలు పోటీలు నిర్వహించారన్నారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్.శాంసన్ జోసఫ్ బహుమతులు అందజేసినట్లు ఆమె తెలిపారు.

ఉచిత రక్తదాన శిబిరం

చంపాపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సాగర్ రోడ్‌లోని వివేకానంద చౌరస్తాలో శుక్రవారం ఎల్బీనగర్ అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులు, దీనబంధు సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి హాజరై మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదాన శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరంలో సుమారు 60మంది పాల్గొని తమ రక్తాన్ని అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అరుణాసింగ్, చిట్టిపోలు రవికుమార్, శ్రీషా, రాజేష్‌బాబు, చిన్నయాదవ్, భార్గవ్, రాఘవేంద్రయాదవ్, జీవన్‌రెడ్డి, శివ, మల్లేష్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, సంకల్ప, సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

చాదర్‌ఘాట్: మీ సేవ ద్వారా రేషన్‌కార్డు (ఆహార భద్రత కార్డు) కోసం దరఖాస్తు చేసుకోవాలని పౌరసరఫరాల విభాగం ఒకటో సర్కిల్ ఏఎస్‌వో నర్సింగ్‌రాజ్ తెలిపారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం, ఇది వరకు ఉన్న రేషన్ కార్డుల్లో అదనంగా కుటుంబీకుల పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

డ్రైవర్ అదృశ్యం

హయత్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే మహ్మద్ వసీం(35) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు వసీం తొర్రూర్ గ్రామం వరకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆ రోజు నుంచి నేటి వరకు ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో తల్లి రజియా శుక్రవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ఐసీఐసీఐ బ్యాంకు ముందున్న ఫుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని మహిళను చాదర్‌ఘాట్ పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటలో ఫుట్‌పాత్‌పైనే నివాసముంటున్న 50 సంవత్సరాల మహిళ ఈనెల 5న మలక్‌పేట ఐసీఐసీఐ బ్యాంకు ఎదుట అపస్మారక స్థితిలో పడి ఉంది. విషయాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు బిక్షాటన చేసి జీవనం సాగిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

కార్ల బ్లాక్ ఫిల్మ్‌ల తొలగింపు

- 25 కార్లకు జరిమానా

చాదర్‌ఘాట్ : మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ ఫిల్మ్‌లతో సంచరిస్తున్న కార్లకు రూ. 1000 చొప్పున జరిమానాలు విధించారు. కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ల తొలగించే స్పెషల్ డ్రైవ్ మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ప్రారంభమైంది. మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్ద మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను హైదరాబాద్ సౌత్ ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. వారం రోజుల క్రితమే కార్లకు ఉన్న బ్లాక్‌ఫిల్మ్‌ల తొలగింపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు డీసీపీ వివరించారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట మెట్రోస్టేషన్, మలక్‌పేట చర్మాస్, మూసారాంబాగ్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా 25 కార్ల అద్దాలకున్న బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి రవాణా

- కారు డిక్కీ లోపల ప్రత్యేక అరలు
- గంజాయి లేడీ డాన్ సహా.. ముగ్గురి అరెస్టు
- రూ. 8.5లక్షల విలువైన 14.5 కేజీల సరుకు, కారు స్వాధీనం



గంజాయి తరలిస్తూ పట్టుబడిన లేడీ డాన్ సునీతాదాస్, ముఠా సభ్యులు

హైదరాబాద్ సిటీ ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న లేడీ డాన్ సహా.. ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 14.5 కేజీల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా మల్కన్‌గిరి జగదేవ్‌పూర్‌కు చెందిన గంజాయి లేడీ డాన్ సునీతాదాస్.. కారులో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో హయత్‌నగర్ డీటీఎఫ్(జిల్లా టాస్క్‌ఫోర్స్) సీఐ నాగరాజు టీమ్ రంగంలోకి దిగింది. ఓఆర్‌ఆర్ ప్రాంతంలో కారును అడ్డుకొని తనిఖీ చేశారు. కారు డిక్కీలోని కింది భాగంలో ఎవరికీ అనుమానం రాకుండా, ఎక్కడా గంజాయి ఆనవాళ్లు కనిపించకుండా డిక్కీలోపల ప్రత్యేక అరలను ఏర్పాటు చేశారు. అందులో 14.5 కేజీల గంజాయిని నింపి డిక్కీని మూసివేసినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులతో హైదరాబాద్ సందర్శనకు వస్తున్నట్లుగా కారులో బయల్దేరినట్లు పోలీసులకు కలరింగ్ ఇచ్చినట్లు తెలిసింది. పోలీసులు కారుతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, లేడీ డాన్ సునీతాదాస్ అనేక అక్రమ మార్గాల ద్వారా గుట్టుగా గంజాయిని హైదరాబాద్‌కు తరలించి, ధూల్‌పేట ప్రాంతంలో బల్క్‌గా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తేలింది. సునీతాదాస్‌తోపాటు కారు డ్రైవర్ ఇస్తియాఖురేషి, కంకన్‌సనలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న సరుకును హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌ను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తిరుపతి యాదవ్ అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

కొత్తపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి తెలిపారు. మూడో విడతలో శుక్రవారం మన్సూరాబాద్ జడ్‌పీహెచ్‌ఎస్ నుంచి 68మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. రహదారి భద్రత అవగాహనలో భాగంగా వారికి లెక్చర్ హాల్‌లో ఉదయం, సాయంత్రం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. చిల్డ్రన్ ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కులో విద్యార్థులకు, కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్‌ఐ నర్సింహారావు, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్ సాధారణ ప్రజలకు, డ్రైవర్లకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారన్నారు. వనస్థలిపురం పరిధిలో 6 ప్రాంతాల్లో, హయత్‌నగర్ పరిధిలోని రెండు విద్యాసంస్థల్లో హస్తినాపురంలోని సంతోషిమాత ఆలయం వద్ద వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, ట్రాఫిక్ నిబంధనలను వివరించారని తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపూడి

57మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సెలింగ్

వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 57మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఓపీ అల్లూరయ్య, టీటీఐ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.